కథ

# రివర్స్

◆ శిష్టా నారాయణమూర్తి ◆

—రోడ్డు ప్రక్కగా నడుస్తున్నాడు. ఎదురుగా ఒక అందమైన అమ్మాయి వస్తూ కనిపించింది.

"అబ్బ! ఎంత అందంగా వుందీ అమ్మాయి!" మనసులో అలా అనుకుంటుండగానే ఆ అమ్మాయి దగ్గరగా వచ్చింది. ఆ అమ్మాయి కూడా రాము వంక చూసింది. చూసి ఊరుకోలేదు. తక్కున కన్ను కొట్టింది.



అంతే! రాముకు వెంటనే ఇంటర్వ్యూ లేకుండా గవర్నమెంటు జాబ్ వచ్చినంత పనైంది. ఆ ఆశ్చర్యంలోంచి తేరుకునేసరికి ఆ అమ్మాయి దూరంగా వెళ్ళిపోయింది.

వెనక్కి తిరిగి గబగబా పరుగులాంటి నడకతో ఆ అమ్మాయి దగ్గరకు చేరుకొని "ఏమండీ! అంటూ కన్నుగొట్టాడు. రాము కన్ను కొట్టడం, ఆ అమ్మాయి నాలుగు చివాట్లు పెట్టడం, "బుద్ధి వుందా రాస్కెల్" అనటం ఏకకాలంలో జరిగిపోయాయి.

"ఇందాక మీరు నన్ను చూసి కన్ను కొట్టారు గదా అని తిరిగి మీకు యమ స్టైల్‌గా కన్నుకొడితే, నన్ను అట్లా నిమ్మారంగా ఇష్టం వచ్చినట్లు తిడతారా?" అంటూ ఆ అమ్మాయిని నిలదీశాడు.

నాకు కళ్ళ జబ్బుంది. కళ్ళు చిట్లించానంతే! ఆమాత్రందానికే కన్ను కొట్టానని ఎలా అనుకొన్నారు? స్టుపిడ్' అంటూ చకచక వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి అలా ప్రవర్తించటం ఎవరయినా చూశారేమోనని చుట్టుప్రక్కల చూసాడు. ఇలాంటి రోమియోలతో పనేంటి అనుకొని ఎవరిదారిన వాళ్లు వెళ్తున్నారు. 'అమ్మయ్యా' అనుకొని వెనక్కు తిరిగి చకచక నడవటం మొదలుపెట్టాడు. 'ఉదయాన్నే ఎవరి మొహం చూశానో' అని తలెత్తకుండా నడుస్తున్నాడు రాము.

కొంతదూరం వెళ్ళేసరికి ఎదురుగా మరో అందమైన అమ్మాయి ఎదురు వచ్చి ఆమె గుండె ఎత్తులు గట్టిగా తగిలేలాగా డాష్ ఇచ్చి కన్ను కొట్టింది. "అయ్యబాబోయ్" అని తలదించుకొని గబగబా నడుస్తున్నాడు రాము. ఎందుకంటే ఇంతకు ముందే తిన్న తిట్లు ఇంకా మరువలేదు. అందుకే వెనక్కు చూడకుండా వెళ్తున్నాడు.

అంతలో ఆ అమ్మాయి రాము దగ్గరకు వచ్చి "ఛీ... కన్నుగొట్టినా రెస్పాన్సివ్వని నువ్వు మగాడివా!" అంటూ ప్రక్కనే నడుస్తోంది.

"ఎవరి మొహం చూసాన్రా దేముడా!" అని అనుకుంటూ రాము పరుగులాంటి నడకతో ప్రక్కసందులోకి పరుగెత్తాడు.

'డామిట్! కథ అడ్డం తిరిగింది' నిరాశగా అనుకుందా అమ్మాయి. ■